బ్రహ్మోత్సవాలకు ముస్తాబు

- తిరుమలనాథస్వామి ఆలయంలో భక్తి శ్రద్ధలతో ప్రత్యేక పూజలు
- నేడు స్వామివారి కల్యాణం


తిరుమలనాథస్వామి దేవాలయం, (ఇన్‌సెట్‌లో) స్వామివారి మూలవిరాట్

స్టేషన్‌ఘన్‌పూర్: డివిజన్‌కేంద్రంలోని పురాతన తిరుమలనాథ స్వామి దేవస్థాన బ్రహ్మోత్సవాల్లో భాగంగా దేవాలయాన్ని అన్ని విధాల ముస్తాబు చేశారు. ఈ నెల 6 నుంచి నిర్వహిస్తున్న బ్రహ్మోతవాల్లో భాగంగా ప్రతీ రోజూ విశేష పూజలను నిర్వహిస్తున్నారు. బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని దేవస్థాన అభివృద్ధి కమిటీ బాధ్యులు, అర్చకులు, భక్తుల ఆధ్వర్యంలో దేవస్థానాన్ని సర్వాంగ సుందరంగా ముస్తాబు చేశారు. ఈనెల 15వ తేదీవరకు స్వామివారి బ్రహ్మోత్సవాలు ఉండగా ప్రధాన ఘట్టమైన తిరుమలనాథస్వామి కల్యాణ మహోత్సవం 12న(బుధవారం) నిర్వహించనున్నట్లు ఆలయ ప్రధాన అర్చకులు కలకోట రామానుజాచార్యులు తెలిపారు. అఖిలాండ కోటి బ్రహ్మాండ నాయకుడైన తిరుమలనాథస్వామి వారి బ్రహ్మోత్సవాల కోసం దేవాలయానికి రంగులు వేయడంతో పాటు ఆకర్షణీయంగా రంగురంగుల విద్యుత్‌దీపాలను ఏర్పాటు చేశారు. భక్తుల సౌకర్యం కోసం దేవాలయం ప్రాంగణంలో చలువ పందిళ్లను, టెంట్‌లను వేయిస్తున్నారు. భక్తుల సహకారంతో ఈ బ్రహ్మోత్సవాలను నిర్వహిస్తున్నామని, స్వామివారి కల్యాణానికి భక్తులు అధిక సంఖ్యలో హాజరై స్వామివారి కృపను పొందాలని ఆలయ అభివృద్ధి కమిటీ బాధ్యులు కోరుతున్నారు.

బ్రహ్మోత్సవం..

బ్రహ్మ అను పదానికి గొప్ప ఆనందాన్ని ఇచ్చేది అని అర్థం. స్వామివారి సౌందర్యం, సౌలభ్యాది గుణసంపదలను, వైభవాలను వివిధ వాహనాల పరిష్కృతమైన అలంకారాలను దర్శింపచేసి భక్తులను ఆనంద పారవశ్యంలో ముంచేదే బ్రహ్మోత్సవం. అలాంటి బ్రహ్మోత్సవాలను నిర్వహించడం ద్వారా ప్రజలకు సకల శుభప్రదములు కలుగుతాయని అర్చకులు తెలిపారు. సర్వంతర్యామి అయిన శ్రీదేవి, భూదేవి సమేతుడైన స్వామివారు భక్త జన సంరక్షణార్థం స్టేషన్‌ఘన్‌పూర్ పట్టణంలో వెలిసి కొలువై ఉన్నాడనేది స్థల పురాణం. భక్తుల కొంగుబంగారంగా ఉన్న శ్రీతిరుమనాథస్వామిని ప్రజలు తమ పూర్వ జన్మ సుకృతంగా భావిస్తూ అనాదిగా ఇక్కడ పూజలు చేస్తూ తరిస్తున్నారు.

ఎంతో పవిత్రమైనవి..



స్వామివారి బ్రహ్మోత్సవ పూజలు ఎంతో పవిత్రమైనవని, ఈ పూజలు చేపట్టడం ద్వారా సకల కష్టాలు తొలగుతాయి. సాక్షాత్తు తిరుమలనాథస్వామి శ్రీదేవి, భూదేవి సమేతంగా ఇక్కడ కొలువై ఉన్నారు. బ్రహ్మోత్సవాల్లో ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారి కృపను పొందాలి.

- కలకోట రామానుజాచార్యులు, ఆలయ ప్రధాన అర్చకుడు

దాతలు, భక్తుల సహకారంతో..



ఘన్‌పూర్‌లోని పురాతన సుప్రసిద్ధ తిరుమలనాథ దేవస్థానంలో స్వామివారి బ్రహ్మోత్సవాలను ప్రతీ ఏడాది భక్తులు, దాతల సహకారంతో ఘనంగా నిర్వహిస్తున్నాం. బ్రహ్మోత్సవాలను నిర్వహించడం ద్వారా ప్రజలు సుభిక్షంగా, సుఖసంతోషాలతో ఉంటారని పురాణాలు చెపుతున్నాయి. గత 18 సంవత్సరాలుగా బ్రహ్మోత్సవాలను నిర్వహిస్తున్నాం.

-కలకోట రంగాచార్యులు, ఆలయ అభివృద్ధి కమిటీ బాధ్యుడు

నియోజకవర్గంలో కాంగ్రెస్ సత్తా చాటాలి

- ఎమ్మెల్యే కడియం శ్రీహరి


స్టేషన్‌ఘన్‌పూర్: మాట్లాడుతున్న ఎమ్మెల్యే శ్రీహరి

స్టేషన్‌ఘన్‌పూర్/చిల్పూరు/జఫర్‌గఢ్: డివిజన్ కేంద్రమైన స్టేషన్‌ఘన్‌పూర్‌లో నిర్వహించే సీఎం సభతో నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ బలం నిరూపించాలని, 50వేల మందికి తగ్గకుండా సీఎం సభను చేపట్టాలని స్థానిక ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. ఈనెల 16న స్టేషన్‌ఘన్‌పూర్‌కు సీఎం రేవంత్‌రెడ్డి రానున్న సందర్భంగా నిర్వహించనున్న భారీ బహిరంగ సభ ఏర్పాట్లపై మండల కాంగ్రెస్ ముఖ్య నాయకులు, కార్యకర్తలతో స్థానిక కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మంగళవారం రాత్రి సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. నియోజకవర్గ అభివృద్ధిని కాంక్షించే ప్రతీ ఒక్కరూ సభను జయప్రదం చేసేలా పనిచేయాలని సూచించారు. నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. అలాగే చిల్పూరు, జఫర్‌గఢ్ మండల కేంద్రాల్లో నిర్వహించిన కాంగ్రెస్ విస్తృత స్థాయి సమావేశాల్లో ఎమ్మెల్యే పాల్గొని మాట్లాడారు. నియోజకవర్గ అభివృద్ధికి దోహదం చేసే సీఎం రేవంత్‌రెడ్డి సభను విజయవంతం చేయాలని కోరారు. సీఎం చేతుల మీదుగా రూ.800 కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్నట్లు తెలిపారు. ఆయా సమావేశాల్లో నాయకులు నూకల ఐలయ్య, మంచాల ఎల్లయ్య, తీగల కర్ణాకర్‌రావు, కట్టా మనోజ్‌రెడ్డి, గడ్డమీది సురేష్, పొట్లపల్లి శ్రీధర్‌రావు, ఎడవెల్లి మల్లారెడ్డి, కేశిరెడ్డి లక్ష్మారెడ్డి, రంజిత్‌రెడ్డి, బాలరాజు, పాశం సురేష్, విజయ్, లింగారెడ్డి పాల్గొన్నారు.

సమన్వయంతో పనిచేయాలి

స్టేషన్‌ఘన్‌పూర్/లింగాలఘణపురం: ఈనెల 16న స్టేషన్‌ఘన్‌పూర్ మండలంలోని శివునిపల్లిలో చేపట్టనున్న సీఎం రేవంత్‌రెడ్డి సభను జయప్రదం చేసేలా పార్టీ నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలి పార్టీ జిల్లా నాయకుడు బూర్ల శంకర్, లింగాలఘణపురం మండలం అధ్యక్షుడు, జనగామ మార్కెట్ వైస్ చైర్మన్ శివకుమార్ అన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి సభను పురస్కరించుకుని ఘన్‌పూర్ డివిజన్ కేంద్రంలో, నెల్లుట్లలో మంగళవారం జరిగిన ముఖ్య నాయకుల సమావేశాల్లో వారు మాట్లాడారు. మాజీ జెడ్పీటీసీ గుడి వంశీధర్‌రెడ్డి, సీనియర్ కాంగ్రెస్ నాయకుడు దిలీప్‌రెడ్డి, సంపత్, జీడికల్ దేవస్థాన చైర్మన్ మూర్తి, జనగామ మార్కెట్ డైరెక్టర్లు, నీల రాములు, కొంతం శ్రీను, పోశాల కృష్ణమూర్తి, తోట సత్యం, మేకల మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

సమాజ సన్మార్గ సేవ కోసం పాటుపడాలి

- ప్రెస్ అకాడమీ చైర్మన్ కె.శ్రీనివాస్‌రెడ్డి


మాట్లాడుతున్న ప్రెస్ అకాడమీ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి

దేవరుప్పుల: కులతత్వ సమాజం కోసం ప్రాకులాడుతున్న తరుణంలో రెడ్డి సామజిక వర్గీయులు సమాజ సన్మార్గ సేవ కోసం పాటుపడాలని ప్రెస్ అకాడమీ చైర్మన్ కలిమెకొలను శ్రీనివాస్‌రెడ్డి, రెడ్డి సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బొబ్బిలి దామోదర్‌రెడ్డి సూచించారు. మంగళవారం మండల కేంద్రంలో రెడ్డి సంక్షేమ సంఘం పై అంతస్తు కమ్యూనిటీ హాల్, దివంగత రిటైర్డ్ డిప్యూటీ డీఈఓ మర్రి రాఘవరెడ్డి స్మారక విగ్రహాన్ని వారిద్దరు కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశానికి రెడ్డి సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఈదునూరి రామచంద్రారెడ్డి అధ్యక్షత వహించగా వారు మాట్లాడారు. సంఘటిత శక్తికి ఇలాంటి కమ్యూనిటీ వేదికలు అత్యంత ఆవశ్యకమన్నారు. రాజకీయాలకతీతంగా రెడ్డిల సేవాతత్వాన్ని ఆచరణాత్మకంగా అమలు చేస్తూ భావితరాలకు ఆదర్శంగా నిలువాలన్నారు. సంక్షేమ భవన నిర్మాణానికి దోహదపడిన మాజీ మంత్రి దయాకర్‌రావుతోపాటు దాతలను అభినందించారు. అనంతరం అతిథులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో రెడ్డి సంక్షేమ సంఘం చైర్మన్ మర్రి పట్టాభిరామిరెడ్డి, ముఖ్య సలహాదారుడు ఈదునూరి వీరారెడ్డి, నర్సింహ్మారెడ్డి,సురేందర్‌రెడ్డి, యాదవరెడ్డి, కడారి నర్సింహ్మారెడ్డి, నడిదె యాదవరెడ్డి, సబ్బు మధుసూదన్‌రెడ్డి, వాణి, బూత్కూరి అశోక్‌రెడ్డి, గోలి తిరుపతిరెడ్డి, రవీందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

పౌష్టికాహారంతో ఆరోగ్యం



నర్మెట: పౌష్టికాహారంతో ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణం సాధ్యమని వైద్యాధికారులు ఉదయ్‌కిరణ్, ప్రసన్న కృష్ణ, ఆర్‌బీఎస్‌కే వైద్యాధికారి చేతన్ అన్నారు. జాతీయ ఆరోగ్య మిషన్, ఆర్‌బీఎస్‌కేలో భాగంగా స్థానిక ఉన్నత పాఠశాలలో మంగళవారం ఏర్పాటు చేసిన వైద్య శిబిరంలో విద్యార్థులకు కంటి స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించి మందులు, అద్దాలు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కంటి లోపలి భాగం మయోపియా, హైపర్ మెట్రోపియా, ప్రెస్బియోపియా మూడు రకాలుగా విభజింపబడి ఉంటుందని చిన్నపిల్లల్లో ముఖ్యంగా మయోపియా దూరం చూపు లోపంతో బ్లాక్‌బోర్డుపై అక్షరాలు కనబడక చాలా మంది విద్యార్థులు ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని క్రమం తప్పకుండా ఆరు నెలలకు ఒకసారి కంటి పరీక్షలు చేయించుకోవాలని అన్నారు. విటమిన్-ఏ ఉండే ఆహార పదార్థాలు క్యారెట్, చిలగడ దుంపలు, ఆకు కూరలు, గుడ్లు, చేపలు, సీతాఫలం, బెల్ పెప్పర్స్ అధికంగా తీసుకోవాలని వారు సూచించారు. చదువుకునే సమయాల్లో వెలుతురు ఉండేలా చూసుకోవాలని తెలిపారు.

కంటి అద్దాల పంపిణీ

కొడకండ్ల: మండలకేంద్రంలోని తెలంగాణ గురుకుల పాఠశాలలోని దృష్టి లోపం ఉన్నటువంటి విద్యార్థులకు మంగళవారం కంటి అద్దాలను పంపిణీ చేశారు. ఆర్‌బీఎస్‌కే కార్యక్రమంలో భాగంగా పాఠశాలలోని 106 మంది విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించి 25 మందికి దృష్టిలోపం ఉన్నట్లు గుర్తించి వారిని జిల్లా కేంద్రంలోని ఆప్తాల్మిక్ ఆధ్వర్యంలో పరీక్షలు చేయించినట్లు ఆర్‌బీఎస్‌కే డాక్టర్ రజినీకాంత్ తెలిపారు. దృష్టిలోపం ఉన్న వారందరికి ప్రిన్సిపాల్ తమ్మి దిలీప్‌కుమార్ ద్వారా కంటి అద్దాలను అందజేసినట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో స్థానిక డాక్టర్ హరికృష్ణ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

టాలెంట్ టెస్ట్‌లో విద్యార్థుల ప్రతిభ



జనగామ: నెహ్రూ పార్క్ సేయింట్ పాల్స్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన సర్ సీవీ రామన్ సైన్స్ టాలెంట్ పరీక్షల్లో పలువురు విద్యార్థులు ప్రతిభ కనబరిచారని హెచ్‌ఎం ఫాదర్ మరియ జోసఫ్ తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ ఈ పరీక్షల్లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు మెడల్స్, ప్రశంసపత్రాలను అందించామని చెప్పారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

'వ్యక్తిగత విమర్శలు సరికాదు'



మాట్లాడుతున్న సత్యనారాయణ

పాలకుర్తి టౌన్: ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయాన్ని ఎర్రబెల్లి దయాకర్‌రావు మంత్రిగా ఉన్నప్పుడు బీఆర్‌ఎస్ కార్యాలయంగా మార్చి, ఇప్పుడు బ్లాక్ మెయిల్ రాజకీయాలతో ఎమ్మెల్యే యశస్విని‌రెడ్డి కుటుంబంపై వ్యక్తిగత విమర్శలు చేయడం సరికాదని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు రాపాక సత్యనారాయణ, కాంగ్రెస్ నాయకులు బిల్లా సుధీర్‌రెడ్డి, గిరగాని కుమారస్వామిలు అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోకి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వారు మాట్లాడారు. ఎర్రబెల్లి ఉషా దయాకర్‌రావు ఏ హోదాలో ప్రభుత్వ కార్యక్రమాల్లో పాల్గొన్నారని, కల్యాణలక్ష్మి చెక్కులు, బతుకమ్మ చీరలు, గురుకుల పాఠశాలల్లో విద్యార్థులకు దుస్తులు పంపిణీ చేశారని, ఆమెకు ఏ అధికారం ఉందని ప్రశ్నించారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయాన్ని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంగా మార్చారని బీఆర్‌ఎస్ పార్టీకి చెందిన నాయకులు కలెక్టర్‌కు ఫిర్యాదు చేయడం విడ్డూరంగా ఉందన్నారు. వీరమనేని యాకంతరావు, సురేష్‌నాయక్, దేశగాని నాగరాజు, అందె యాకయ్య,గడ్డం యాకసోమయ్య, సురేందర్‌రావు, రాజేష్‌నాయక్, గాదెపాక భాస్కర్, కమ్మగాని నాగయ్య, పన్నీరు వెంకన్న పాల్గొన్నారు.

భూక్య కల్పనకు అవార్డు



రఘునాథపల్లి: మండలంలోని ఖిలాషాపూర్ గ్రామ ఏఈఓ భూక్య కల్పనకు అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఉత్తమ ఉద్యోగి అవార్డు రాగా జిల్లా కేంద్రంలో మంగళవారం కలెక్టర్ రిజ్వాన్‌బాషా చేతుల మీదుగా అందుకుంది. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ పింకేష్‌కుమార్, రెవెన్యూ శాఖ రోహిత్‌సింగ్, జిల్లా వ్యవసాయాధికారి రామ్ నాయక్ తదితరులు ఉన్నారు.

వేసవిలో తాగునీటి సమస్య రాకుండా చూడాలి


సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి

- ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి

పాలకుర్తి టౌన్: నియోజకవర్గంలో వేసవిలో ప్రజలకు తాగునీటి సమస్య తలెత్తకుండా ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేయాలని ఎమ్మెల్యే మామిడాల యశస్విని‌రెడ్డి అధికారులను ఆదేశించారు. మంగళవారం మండల కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులతో ఎమ్మెల్యే సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నియోజవర్గంలో తాగు నీటి సమస్య ఉన్న గ్రామాలను గుర్తించి, గ్రామాలో రైతుల నుంచి బోరు బావులను వేసవి కాలం పూర్తయ్యే వరకు అద్దెకు తీసుకోవాలని సూచించారు. మిషన్ భగీరథ నీటిని ప్రతి ఇంటికి అందేలా చూడాలన్నారు. మిషన్ భగీరథ గ్రిడ్ ఈఈ సురేందర్, ఇంట్రా ఈఈ కృష్ణరెడ్డి,శ్రీకాంత్, గ్రిడ్ ఇంట్రా డీఈలు స్వామిదాస్, సూర్య, శ్రీనివాస్, సంధ్య, శ్రీనివాస్, ఏఈలు తదితరులు పాల్గొన్నారు.

చదువుతో పాటు క్రీడల్లో రాణించాలి

చదువుతో పాటు క్రీడల్లో రాణించాలనిఎమ్మెల్యే యశస్వినిరెడ్డి, నియోజవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ ఝాన్సీరెడ్డి అన్నారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో లక్ష్మీనారాయణపురం గ్రామానికి చెందిన గూడ రవీందర్ కూతురు చైతన్య జాతీయ స్థాయి కరాటే పోటీల్లో బంగారు పతకం సాధించగా, ఆమెను సన్మానించి అభినందించారు.

రామచంద్రు మృతి తీరని లోటు

చాకలి ఐలమ్మ మనుమడు చిట్యాల రామచంద్రు అకాల మృతి నియోజకవర్గానికి తీరని లోటు అని ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి, కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ హనుమాండ్ల ఝాన్సీరెడ్డిలు అన్నారు. ఇటీవల మృతి చెందిన రామచంద్రు కుటుంబీకులను వారు పరామర్శించారు.

'వర్గీకరణ చేసే వరకు ఉద్యోగ ఫలితాలు విడుదల చేయొద్దు'


దీక్షలో కూర్చున్న నాయకులు

జనగామ: ఎస్సీ వర్గీకరణ చట్టం చేసే వరకు తెలంగాణలో విడుదల చేయబోతున్న వివిధ ఉద్యోగాల ఫలితాలను నిలిపివేయాలని, ఎస్సీ వర్గీకరణ లేకుండానే ఉద్యోగ పరీక్ష ఫలితాలను విడుదల చేయడమంటే మాదిగలను దగా చేయడమేనని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాగ్యల ఉపేందర్ మాదిగ అన్నారు. గ్రూప్-1 ఫలితాలు విడుదల చేయడం పట్ల నిరసన వ్యక్తం చేస్తూ మహాజన నేత మందకృష్ణ మాదిగ ఆదేశాల మేరకు ఎమ్మెస్పీ జిల్లా అధ్యక్షుడు గద్దల కిషోర్ అధ్యక్షతన జిల్లా కేంద్రంలో ఎమ్మార్పీఎస్, ఎమ్మెస్పీ ఆధ్వర్యంలో మంగళవారం నిరవధిక రిలే నిరసన దీక్షలు చేపట్టారు. ఈ సందర్భంగా ఉపేందర్ హాజరై పూలమాలలు వేసి దీక్షలను ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడారు. సీఎం రేవంత్‌రెడ్డి మాదిగల విషయంలో మాటల్లో ఒకటి చేతల్లో మరొకటి చేస్తూ మాలల ఒత్తిడికి తలొగ్గి మెజార్టీ ఉద్యోగాలు రాకుండా చేస్తున్నారని అన్నారు. మహేష్, రాజు, రవి, శాంసాన్, కుమార్,నాగేష్, సోమరాజు శ్రావణ్ పాల్గొన్నారు.

'ఎకరాకు రూ.50 వేల పరిహారం ఇవ్వాలి'


మాట్లాడుతున్న యాకూబ్‌పాషా

జఫర్‌గఢ్: నీరందక ఎండిపోయిన పంటలకు ఎకరాకు రూ.50 వేల నష్టపరిహారం చెల్లించి రైతులను ఆదుకోవాలని తెలంగాణ రైతు సంఘం మండల అధ్యక్షుడు ఎండీ యాకూబ్‌పాషా ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో రైతు సంఘం ముఖ్యకార్యకర్తలతో మంగళవారం ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వానికి ముందు చూపు లేకపోవడంతో దేవాదుల ద్వారా చెరువులు, కుంటలలోకి నీటిని తరలించలేకపోయారన్నారు. దీనివల్ల బోరు బావులలో నీరు అడుగంటిపోవడం వల్ల వరి పంట ఎండిపోయి రైతులు తీవ్రంగా నష్టపోయారన్నారు. సమావేశంలో రడపాక సత్తయ్య, మంద బుచ్చయ్య, రాములు, సాయిలు తదితరులు పాల్గొన్నారు.

హైమాస్ట్ లైట్ల అందజేత



చిల్పూరు: చిల్పూరు ఆలయానికి గ్రేటర్ వరంగల్ పరిధిలోని 55వ డివిజన్ కార్పొరేటర్ జక్కుల రజిత -వెంకటేశ్వర్లు మంగళవారం ఈఓ లక్ష్మీప్రసన్న, చైర్మన్ శ్రీధర్‌రావులకు రూ. 36 వేల విలువైన హైమాస్ట్ లైట్లను అందజేశారు. కార్యక్రమంలో సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అదనపు ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటు


ట్రాన్స్‌ఫార్మర్ వద్ద డివిజనల్ ఇంజనీర్ తదితరులు

జనగామ: సమ్మర్ యాక్షన్ ప్లాన్‌లో భాగంగా పట్టణంలో అదనపు ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేసినట్లు డివిజనల్ ఇంజనీర్ లక్ష్మీనారాయణ తెలిపారు. మంగళవారం టౌన్-2 సెక్షన్ పరిధిలో మూడు 100 కేవీ ట్రాన్స్ ఫార్మర్ పరిధిలో మూడు 160 కేవీ సామర్థ్యం కలిగిన వాటిని బిగించినట్లు తెలిపారు. అలాగే రెండు 63 కేవీ ట్రాన్స్ ఫార్మర్ల స్థానంలో మరో రెండు 100 కేవీ సామర్థ్యంతో ఉన్న వాటిని ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో ఏడీఈ వే ణుగోపాల్, ఏఈ చంద్రమోహన్, జనగామ-2 స్టాఫ్ ఎస్‌ఎల్‌ఐ, ఎల్‌ఐ, ఎల్‌ఎం, ఏఎల్‌ఎంలతో పాటు తదితరులు పాల్గొన్నారు.

ఎల్ఆర్ఎస్‌ను వినియోగించుకోవాలి

- డీఏఓ రామారావు నాయక్


మాట్లాడుతున్న రామారావు నాయక్

బచ్చన్నపేట: మండలంలో ప్లాట్లు ఉన్నవారు ఎల్ఆర్ఎస్ పథకాన్ని వినియోగించుకోవాలని జిల్లా వ్యవసాయ అధికారి రామారావు నాయక్ అన్నారు. మంగళవారం మండలంలోని పోచన్నపేట గ్రామ పంచాయతీ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులకు అవగాహన సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎల్ఆర్ఎస్‌కు దరఖాస్తు చేసుకున్న వారికి రుసుంలో 25 శాతం రాయితీ ఇస్తున్నారని, ఈ విషయాన్ని దరఖాస్తుదారులకు అవగాహన కల్పించాలన్నారు. ఎంపీడీఓ వెంకట మల్లికార్జున్, పంచాయతీ కార్యదర్శులు నర్సింహాచారి, కర్ణాకర్, వెంకటేష్, భరత్ కిషోర్ పాల్గొన్నారు.

పంటల పరిశీలన

చిన్న రామన్‌చర్ల గ్రామంలో ఇటీవల ఎండిపోయిన వరి పంటలను జిల్లా వ్యవసాయ అధికారి రామారావు నాయక్ పరిశీలించారు. మంగళవారం మండల వ్యవసాయ అధికారి విద్యాకర్‌రెడ్డితో కలిసి ఎండిపోయిన పంటలను పరిశీలించారు. పంటలు ఎండిపోయినాయని రైతులు ఆందోళన చెందవద్దని ఈ విషయాన్ని పైఅధికారులకు తెలియజేస్తామన్నారు.

అన్ని రంగాల్లో చైతన్యం కావాలి

బచ్చన్నపేట: మహిళలు అన్నిరంగాలో చైతన్యం కావాలని, అప్పుడు మహిళా సాధికారత సాధించినట్లవుతుందని మండల విద్యాధికారి ఇర్రి వెంకట్‌రెడ్డి అన్నారు. మన్‌సాన్‌పల్లి గ్రామ ప్రాథమికోన్నత పాఠశాలలో మంగళవారం అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ ఈ పోటీ ప్రపంచంలో పురుషులతో సమానంగా మహిళలు పోటీ పడాలన్నారు. అనంతరం మహిళా టీచర్లను శాలువాలతో సన్మానించారు. హెచ్‌ఎం నూకల ఎల్లారెడ్డి, ఉపాధ్యాయులు అరుణ, ప్రియాంక, కుమారి, మౌనిక, సరిత విద్యార్థులు పాల్గొన్నారు.

'యువకులను విడుదల చేయాలి'

జఫర్‌గఢ్: ములుగు జిల్లా వాజేడు వద్ద పోలీసులు అదుపులోకి తీసుకున్న ఇద్దరు యువకులను వెంటనే విడుదల చేయాలని పౌరహక్కుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గడ్డం లక్ష్మణ్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నారాయణరావు మంగళవారం ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండలంలోని తిమ్మంపేట, తీగారం గ్రామాలకు చెందిన ఇల్లందుల విజయ్, నాగరాజులను వాజేడు వద్ద మంగళవారం పోలీసులు అరెస్టు చేశారని, వారిని గుట్టల చుట్టూ తిప్పుతూ ఎన్‌కౌంటర్ చేసేందుకు పోలీసులు ప్రయత్నిస్తున్నారని పేర్కొన్నారు. వెంటనే వారిని విడుదల చేసేలా మంత్రి సీతక్క ప్రత్యేక చొరవ తీసుకోవాలని కోరారు.

నేడు వేంకటేశ్వరుడి కల్యాణం

చిల్పూరు: చిల్పూరు ఆలయంలో బ్రహ్మోత్సవాల్లో భాగంగా నేడు స్వామివారి కల్యాణానికి ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఆలయ ఈఓ లక్ష్మీప్రసన్న, చైర్మన్ శ్రీధర్‌రావులు తెలిపారు. మంగళవారం గుట్ట కింద నూతనంగా ఏర్పాటు చేసిన కల్యాణ మండపంలో ఏర్పాట్లను వారు పరిశీలించి మాట్లాడారు. కల్యాణానికి కలెక్టర్ రిజ్వాన్‌బాషా, ఎంపీ కావ్య, ఎమ్మెల్యే కడియం శ్రీహరి, వీఐపీలతో పాటు, దాతలు, భక్తులు అధిక సంఖ్యలో హాజరవుతున్నందున అందుకు తగినట్లుగా సౌకర్యాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అర్చకులు రవీందర్‌శర్మ, రంగాచార్యులు, కృష్ణమాచార్యులు, జూనియర్ అసిస్టెంట్ మోహన్, వీరన్న ధర్మకర్తలు పాల్గొన్నారు.

ఆహ్వానం

రఘునాథపల్లి: ఈనెల 23న మండల ఆర్యవైశ్య సంఘం చేపట్టనున్న ప్రమాణ స్వీకారానికి హాజరు కావాలంటూ రాష్ట్ర ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్మన్ కాలువ సుజాతను మండల ఆర్యవైశ్యులు హైదరాబద్‌లోని అరణ్య భవన్‌లో కలిసి శాలువాతో సన్మానించి ఆహ్వానించారు. రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు శివకుమార్, ఉపేందర్, మండల సంఘం అధ్యక్షుడు సోమేశ్వర్, వజ్రయ్య, రవి ఉన్నారు.

ఆలయంలో పూజలు

బచ్చన్నపేట: తమ్మడపల్లి గ్రామంలో బీరప్ప ఉత్సవాల్లో భాగంగా పలువురు నాయకులు మంగళవారం ఘనంగా పూజలను నిర్వహించారు. ఆలయంలో ఒగ్గు బీర్ల పూజార్లు కాశీ రామక్క కథ పురాణాన్ని వినిపించారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు సౌడ రమేశ్, సద్ది సోమిరెడ్డి, బేజాడి బీరప్ప, కూరెళ్ల వెంకట్‌రెడ్డి, రాపెల్లి చక్రపాణి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు నూకల బాల్‌రెడ్డి, మట్టి బాల్‌రాజు, దూడల కనుకయ్య, నీల రమేశ్, బేజాడి సిద్దులు, శ్రీనివాస్‌రెడ్డి, మల్లారెడ్డి పాల్గొన్నారు.

వాటర్‌బాటిళ్ల పంపిణీ

కొడకండ్ల: మండలకేంద్రంలోని ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు మంగళవారం వాటర్‌బాటిళ్లను హెచ్‌ఎం దోర్నం ప్రభాకర్ అందజేశారు. పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయురాలు కవిత సోదరి డాక్టర్ ఎర్ర ప్రశాంతి ఆర్థిక సహకారంతో 60 మందికి వాటర్ బాటిళ్లను అందజేశారు. ప్రస్తుతం ఎండలు మండుతున్న తరుణంలో విద్యార్థులకు ఉపయోగకరంగా వాటర్‌బాటిళ్లను అందించిన దాతకు హెచ్‌ఎం కృతజ్ఞతలు తెలిపారు.

సంక్షిప్త సమాచారం

ఉద్యోగులకు బదిలీలు సహజం

రఘునాథపల్లి: ప్రభుత్వ ఉద్యోగులకు బదిలీలు తప్పవని ఎంఈఓ రఘునందన్ అన్నారు. జాఫర్‌గూడెం ప్రాథమిక పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయిని అనురాధ బదిలీపై వెళ్తున్న సందర్భంగా మంగళవారం వీడ్కోలు సమావేశం హెచ్‌ఎం శాగ కైలాసం అధ్యక్షతన ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఖిలాషాపూర్ స్కూల్ కాంప్లెక్స్ హెచ్‌ఎం డాక్టర్ బారత రవీందర్, ఉపాధ్యాయులు ఘనీల, శివకుమార్, శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

విద్యార్థులే ఉపాధ్యాయులైన వేళ



పాలకుర్తి/బచ్చన్నపేట/జనగామ రూరల్: పాలకుర్తి మండలంలోని తిర్మలగిరి, బచ్చన్నపేట మండలంలోని పడమటికేశ్వాపూర్, రామచంద్రాపూర్, జనగామ మండలం వడ్లకొండలోని పాఠశాలల్లో విద్యార్థులు మంగళవారం స్వయంపరిపాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కొందరు విద్యార్థులు ఉపాధ్యాయులుగా వ్యవహరించి తోటి విద్యార్థులకు విద్యాబోధన చేశారు. ఆయా కార్యక్రమాల్లో ఎంఈఓ ఇర్రి వెంకట్‌రెడ్డి, హెచ్‌ఎంలు నూకల ఎల్లారెడ్డి , సద్గుణాచారి, సత్యనారాయణ, నిమ్మ రాంరెడ్డి, ఉపాధ్యాయులు రాజ్‌కుమార్, ఐలయ్య, కరుణాకర్, మహేష్‌కుమార్, అరుణ, ప్రియాంక, విద్యార్థులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి

నర్మెట: రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతూ వ్యక్తి మృతిచెందిన సంఘటన మంగళవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు.. మండలం అక్కరాజుపల్లికి చెందిన మినలాపురం యాదగిరి (45) ఈనెల 2న రాత్రి తరిగొప్పుల నుంచి నర్మెటకు వస్తున్న క్రమంలో నర్మెటలో రాంగ్ రూట్‌లో ఇండికేటర్స్ వేయకుండా రాంగ్ పార్కింగ్ చేసిన బ్యంగి సురేందర్ కారును వెనకనుంచి ఢీకొనడంతో తలకు తీవ్రమైన గాయాలవడంతో కుటుంబ సభ్యులు హైదరాబాద్ నిమ్స్‌కు తరలించారు. కాగా, చికిత్స పొందుతూ మృతిచెందాడు. మృతుని కుమారుడు తరుణ్ ఫిర్యాదు మేర కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టినట్లు ఎస్సై నైనాల నగేశ్ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడిన యువకుడి..

జఫర్‌గఢ్: రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి హైదరాబాద్‌లోని గాంధీ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ యువకుడు భూక్య చిట్టిబాబు మంగళవారం మృతి చెందినట్లు స్థానిక ఎస్సై రామ్‌చరణ్ తెలిపారు. లక్ష్మీనాయక్‌తండాకు చెందిన చిట్టిబాబు (28) ఈనెల 10న బ్యాంక్ పని నిమిత్తం స్టేషన్‌ఘన్‌పూర్‌కు వెళ్లి రాత్రి బైక్‌పై ఇంటికి వస్తుండగా తిమ్మంపేట శివారులో బైక్ అదుపుతప్పి రోడ్డుపై పడడంతో తలకు తీవ్ర గాయాలయ్యాయి. చికిత్సనిమిత్తం వరంగల్ ఎంజీఎంలో చేర్పించారు. చికిత్సపొందుతూ పరిస్థితి విషమించడంతో హైదరాబాద్‌లోని గాంధీ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందినట్లు తెలిపారు. కాగా, బాధిత కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దరాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

ఉరేసుకుని వృద్ధుడి ఆత్మహత్య

జఫర్‌గఢ్: ఒంటరి జీవితంపై విరక్తి చెంది ఉరి వేసుకుని వృద్ధుడు ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన మండల కేంద్రంలో మంగళవారం చోటు చేసుకుంది. స్థానిక ఎస్సై రామ్‌చరణ్ తెలిపిన ప్రకారం.. మండలంలోని సాగరం గ్రామానికి చెందిన నల్లబెల్లి కొమురయ్య (68)కు భార్య, పిల్లలు లేకపోవడంతో కొన్నేళ్లుగా జఫర్‌గఢ్‌లోని మూసివేసిన డిగ్రీ కళాశాలలోని ఒక గదిలో ఉంటూ జీవనం సాగిస్తున్నాడు. ఇదే క్రమంలో ఎవరు లేని సమయంలో గదిలో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ విషయాన్ని స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. కాగా, మృతుడి బంధువుల ఫిర్యాదు మేరకు శవపంచనామ నిర్వహించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

పరామర్శ

స్టేషన్‌ఘన్‌పూర్: తాటికొండ గ్రామానికి చెందిన పీఏసీఎస్ సీఈఓ ఎండీ మగ్దుంఅలీ తల్లి అలీమాబీ, కీసర యాదవరెడ్డి అనారోగ్యంతో మృతిచెందారు. కాగా, బాధిత కుటుంబాలను మాజీ వైస్ ఎంపీపీ చల్లా సుధీర్‌రెడ్డి మంగళవారం పరామర్శించారు. అదేవిధంగా జిట్టిగూడెం గ్రామ పరిధిలోని గాలిగుట్టతండాకు చెందిన రామోజీ భార్య నీల అనారోగ్యంతో మృతిచెందగా మృతురాలి కుటుంబాన్ని పరామర్శించారు. బేతి జయపాల్‌రెడ్డి, రాంచంద్రారెడ్డి, మల్లారెడ్డి, రాజేష్‌రెడ్డి, రాజయ్య, చిరంజీవి, నాగరాజు తదితరులు ఉన్నారు.

దేవరుప్పులలో..

దేవరుప్పుల: మండల కేంద్రానికి చెందిన బీఆర్‌ఎస్ నాయకుడు, మాజీ ఉపసర్పంచ్ తోటకూరి దశరథ తల్లి బుచ్చమ్మ మృతి చెందింది. కాగా, ఆ పార్టీ జిల్లా నాయకుడు పల్లి సుందర్‌రామిరెడ్డి నాయకులతో కలిసి గ్రామానికి వెళ్లి బాధిత కుటుంబాన్ని పరామర్శించి ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు.